

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

2022-ఫిబ్రవరి

అశోక్ స్టడీలో ఒంటరిగా కూర్చొని వున్నాడు. గదిలో చీకట్లు కమ్ముకుంటున్నాయి. లేచి లైటు వేసుకోవాలని కూడా అనిపించడంలేదతనికి. అసలతనికి నమ్మ శక్యంగా లేదు. అమ్మ చచ్చిపోవడం ఏమిటి? అమ్మలెక్కడైనా చచ్చిపోతారా? అంత అన్యాయం ఎక్కడైనా వుంటుందా?

హాస్పిటల్‌లో రెండు వారాలకి పైగా వుంది అమ్మ. జ్వరమూ, ఇంఫెక్షనూ తగ్గిందన్నారు. డిశ్చార్జి చేస్తున్నామన్నారు! హమ్మయ్య, అని తాము వూపిరి పీల్చుకునేలోగానే, మళ్ళీ అర్ధ రాత్రి ఫోన్ చేసి,ఆమెకి ఊపిరి అందటంలేదనీ, పరిస్థితి విషమిస్తూందనీ చెప్పారు. తమనెవరినీ ఆస్పత్రికి రానివ్వనేలేదు. రాత్రంతా నిద్ర పట్టనేలేదెవరికీ.

పొద్దునే ఫోన్, "సారీ! వొచ్చి బాడీని కలెక్టు చేసుకోండి!" అంటూ!

బాడీనా? అమ్మ బాడీనా? మెదడు మొద్దుబారిపోయింది తనకి. అనూ గొల్లుమంది. భాను చకచకా పన్లు మొదలుపెట్టింది. ఎలా అన్ని కార్యక్రమాలు జరిపించిందో, అమ్మూని అందరినీ ఎలా పిలిపించిందో, ఏదీ తనకి గుర్తు కూడా లేదు. కనీసం ఏడుపు కూడా రాని స్తబ్ధత! రెండు నెలలైపోయిందా అప్పుడే? రెండు నెలలా? రెండు నెలలేనా? కాలం అసలు గడుస్తూందా? ఆగిపోయిందా?

రెండు వారాల సెలవైపోయినా ఇన్స్టిట్యూట్‌కి వెళ్ళే శక్తి లేకపోయింది తనకి. నెలరోజుల పాటు సెలవుపొడిగించాడు. వారం రోజులనించీ మళ్ళీ ఇన్స్టిట్యూట్‌కి వెళ్ళడం మొదలు పెట్టాడు. అందరూ డిపార్ట్‌మెంటులో సానుభూతి తెలిపారు. దగ్గర చదువుకుంటున్న విద్యార్థులు ప్రేమతో ఆలింగనం చేసుకున్నారు. ఏదీ తన మనసుకి అంటుకోవడంలేదు. అదే అర్థం కావడంలేదతనికి. ఏం జరిగింది? ఏం విరిగిపోయింది లోపల?

చుట్టూ మౌనం పేరుకొని పోతూవుంది. డిపార్ట్‌మెంట్ స్టాఫ్ రూంలో చర్చలు జరుగుతూనే వున్నాయి. తనకే ఏ చర్చలో పాల్గొనే ఆసక్తి పోయింది. తన మానసిక స్థితిని అర్థం చేసుకున్నట్టు భాను చాలా ఓపికగా వుంది. ఆమెకొక్కదానికీ అన్ని బాధ్యతలూ వొదిలిపెట్టి తన నొప్పిలో తానుండిపోయాడు. ఆమె పరిస్థితికి తనకి గిల్టీగా అనిపించినా, కదిలే శక్తి కూడా లేనట్టు వుండిపోయాడు.

ఆఖర్న తను అమ్మతో యేం మాట్లాడాడు? వాతావరణం గురించా? పిల్లలగురించా? ఆరోగ్యం గురించా?

"అన్నం తిన్నావా అశోక్?"అని అమ్మే తనని అడిగిండొచ్చు. గుర్తు రావడంలేదే తనకి! రోజూ మాట్లాడే అమ్మతో యేం మాట్లాడాడో తనకే గుర్తు రావడంలేదు. ఎంత విచిత్రం.

నాన్న పోయినప్పుడు తనకి పదేళ్ళున్నాయేమో. తననీ, అయిదేళ్ళ అమూల్యనీ అమ్మ ఒంటరిగానే పెంచింది. పాపం అప్పుడామెకి పట్టుమని ముప్ఫై యేళ్ళు కూడా వుండి వుండవు. నలభై యేళ్ళకి పైగా ఒంటరితనం. ఇద్దరు పిల్లల ఒంటరి తల్లిని వేధించే మగవారికేం తక్కువ? అయినా భయపడకుండానే వున్నది. చుట్టు పక్కల అందరినీ మంచి చేసుకుంటూ, నెమ్మదస్తురాలని పేరు తెచ్చుకొని ఎలా నిబ్బరంగా గడిపిందో పాపం. తల్లి మరణించినందుకంటే, ఆమె అనుభవించిన ఒంటరితనం తలచుకుంటే దుఃఖం ఎక్కువైందతనికి.

కళ్ళు తుడుచుకొని ఒక్కసారి గదంతా కలయ చూసాడు. ఏదీ మారలేదు. అదే కుర్చీ, అవే పుస్తకాలూ, కాగితాలూ తనవి చెల్లా చెదురుగా. అన్నీ అవే. ఏవీ మారలేదు. కానీ అంతా మారిపోయినట్టనిపిస్తుంది. బయట నగరమంతా నిశ్శబ్దంగా చీకట్లోకి జారుతోంది. తన చుట్టూ వున్న పుస్తకాల మధ్య జవాబు లేని ప్రశ్నలతో తాను.

ఆ పుస్తకాల్లో అన్ని ప్రశ్నలకీ జవాబులుంటాయని తాననుకున్నాడు. కానీ "అమ్మలెందుకు చచ్చిపోవాలి?" అన్న ప్రశ్నకి జవాబే లేదు వాటిల్లో. పోనీ, అమ్మ చచ్చిపోతే యెలా తట్టుకోవాలో చెప్పే పుస్తకం కూడా లేదు.

యాభై యేళ్ళ ఆంగ్ల ప్రొఫెసర్ తను, భర్త, ఇద్దరు ఎదిగిన పిల్లలకి తండ్రి. కానీ తల్లిని పోగొట్టుకున్న బిడ్డ తాను. అతనికి చిన్నప్పట్లా అమ్మ చీర కుచ్చిళ్ళలో మొహం దాచుకోవాలనిపించింది.

"అశోక్! లే, ఇవాళ త్వరగా వెళ్ళాలన్నావు. ఆలస్యమవుతూంది, లే," అంటూనో,

"అశోక్! చలిగా వుంది, స్వెట్టర్ వేసుకో!" అంటూనో

"అశోక్! లంచ్ డబ్బా పెట్టుకున్నావా?" అంటూనో తల్లి గొంతు ఇక వినపడదు. ఒక జీవితం ఇంత త్వరగా, ఇంత నిశ్శబ్దంగా నిష్క్రమిస్తుందా? పదిమందికి చదువు నేర్పించే గురువు తాను. తన దగ్గిరికీ పిల్లలూ, పెద్దలూ సలహాలకోసం వస్తూ వుంటారు. కానీ ఇప్పుడు చిన్న పిల్లాడిలా తల్లి కోసం తల్లడిల్లుతున్నాడు.

తన జీవితాన్నీ మొట్ట మొదటి క్షణం నుంచీ చూసిన సాక్షి ఆమె. తను పుట్టగానే దగ్గరికి తీసుకొని ముద్దాడిన మనిషి, తన ఎదుగుదలని మురిపెంగా చూసుకున్న మనిషి, అడొలెసెంట్ వయసులో తన సిగ్గునీ మొహమాటాన్నీ అర్థం చేసుకొని తనని ప్రోత్సహించిన మనిషీ, తన చదువునీ, వృత్తిలో ఎదుగుదలనీ చూసి గర్వపడ్డ మనిషీ, ఇప్పుడు లేదు. అతన్ని చెప్పలేనంత ఒంటరితనం చుట్టుముట్టింది.

తను ఇంగ్లీషు చదువుతానన్నా, డాన్సు క్లాసులో చేరతానన్నా, దేనికీ పెద్దగా అడ్డు చెప్పలేదు. మనసులో కదిలే ఆశలూ, నిరాశలూ, భయాలూ చిన్నప్పుడు తనతో చెప్పుకున్నా, పెద్దయిన తరవాత పెద్దగా చెప్పేది కాదు. తను ఇంకొంచెం అమ్మని పట్టించుకోని వుండాల్సిందా? ఆస్పత్రికి ఇంకొంచెం ముందుగా తీసికెళ్ళాల్సిందా? అసలు ఆస్పత్రికి

తీసికెళ్ళకుండా ఇంట్లోనే వుంచితే బాగయిపోయేదేమో. అనవసరంగా హాస్పిటల్‌లో చేర్పించి తన తల్లిని తనే చేతులారా చంపుకున్నాడా? ఆ ఆలోచనకే అతను వణికిపోయాడు.

★★★★★★★★★★★★★★★

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. లాప్‌టాప్‌లో డబ్బు లెక్కలు వేస్తూ వుంది భాను. ఆమెకి చాలా అలసటగా అనిపిస్తూ వుంది. తన తల్లి మరణం తరవాత తాను చాలా మారిపోయాననుకునేది భాను. చిన్నప్పుడున్నంత ఎమోషనల్‌గా లేను, పెద్దరికం వచ్చేసింది అనుకునేది. అమ్మ పోయినప్పుడు తన దుఃఖంలో తానుంటే అంతా తండ్రి చూసుకున్నాడు. ఇప్పుడు ఆ పరిస్థితిలో తానుంది.

అశోక్ చాలా నెమ్మదస్తుడే కానీ ధైర్యంగా నిలబడగలడు కూడా. భర్తగా, తండ్రిగా ఇన్నాళ్ళూ అదే చూసింది. కానీ ఇప్పుడు, అసలు ఈ మనిషి తనకి పరిచయమే లేనట్టనిపిస్తుంది. పూర్తిగా బెంబేలెత్తిపోయాడు. అత్తగారి మరణం గురించి తనసలు బాధపడటానికి కూడా తీరిక చిక్కటంలేదో ఏమో!

అందరు అత్తాకోడళ్ళలా తామిద్దరూ పెద్ద కీచులాడుకోలేదు. కనీసం, తను అప్పుడప్పుడూ పనెక్కువైందని విసుక్కున్నా, ఆవిడెప్పుడూ తనని నొప్పించే మాటలననే లేదు. పాపం, ముప్పై యేళ్ళ వయసులో భర్తని పోగొట్టుకున్నారావిడ. ఏం ఒంటరితనం అనుభవించినా అది మనసులోనే దాచుకున్నారు తప్ప తనతో యెప్పుడూ చెప్పుకోలేదు. కాలేజీలో ఆమె చదువు చెప్పిన విద్యార్థులూ, తోటి లెక్చరర్లూ ఇంటికి బానే వచ్చేవారు.వాళ్ళతో స్నేహంగా వుండేవారు.

ఆవిడని ఇంకొంచెం ప్రేమగా చూసుకొని వుండాల్సిందేమో. భానుకి మనసంతా బరువెక్కింది. తన జీవితంలో తల్లి స్థానంలో వున్న ఇద్దరాడవాళ్ళూ తననొదిలి పోయారు. తనకీ యాభై యేళ్ళొచ్చేసాయి. తను ఒంటరిగా తన ఇద్దరి పిల్లలకీ పెళ్ళిళ్ళూ మిగతా ప్రయోజనాలూ చేయగలదా! ఆమెకి వున్నట్టుండి గాభరాగా అనిపించింది. లేచి వెళ్ళి మంచి నీళ్ళు తెచ్చుకుని తాగింది.

మళ్ళీ డబ్బు లెక్కల్లోకి దృష్టి సారించింది. అశోక్ కొంచెం ఈ డబ్బు వ్యవహారాలు చూసుకుంటే బాగుండు. ఇద్దరి జీతాన్నీ, జాగ్రత్తగా ఖర్చు పెడుతూ, పిల్లలకోసం కొంచెం డబ్బు దాచిపెడుతూ, ఏదో తాటి పైన నడుస్తున్నట్టే వుంది. ఏ ఖర్చూ తగ్గేట్టు లేదు. అత్తయ్య గారి కర్యక్రమానికి బాగానే ఖర్చయింది. నాన్న కిందటేడు దాచుకొమ్మని ఇచ్చిన డబ్బుతో అనఘకి గొలుసూ, గాజులూ కొన్నది.

అశోక్ రెండు నెలలనించీ లీవ్ పెట్టాడు. ఇక వున్న లీవంతా అయిపోయింది. ఇంకా లీవ్ పెడితే లాస్ ఆఫ్ పే మీద పెట్టాలి. ఆ విషయం అతనితో యెత్తడానికి తనకి మనసే రాలేదు. అతనే వారం రోజులనించి ఇన్స్టిట్యూట్‌కి వెళుతున్నాడు. కానీ మనిషి చాలా ముభావంగా, నిశ్శబ్దంగా అయిపోయాడు. ఈ దెబ్బనుంచి అతను కోలుకోవడానికెన్నాళ్ళు పడుతుందో! తనూ అమ్మ పోయిన యేడాదిక్కానీ మామూలు మనిషి కాలేకపోయింది. అశోక్‌కి

కోలుకోవడానికి టైం ఇవ్వాలని తనకీ తెలుసు. కానీ, తనకీ ఒంటరిగా అనిపిస్తూవుంది ఈ మధ్య. అనఘు చదువూ, భార్గవ్ వ్యాపకాలూ, ఇంటి పనులూ, ఆఫీసులో కెరీరూ, తామిద్దరి ఆరోగ్యమూ, ఎన్నెన్ని విషయాలని తనొక్కతే కనిపెట్టుకొని వుండగలదు?

అనఘుకి ఇంకో నెలరోజుల్లో బీయెస్సీ సెకండ్ ఇయర్ పరీక్షలు. సరిగ్గా కోవిడ్ టైములో చేరింది. ఏం చదువుతుందో ఏమో! దానికి తోడు బాగా చిరుతిండి అలవాటైంది, ఎటువంటి వ్యాయామమూ లేకుండా పోతుంది. భార్గవ్ రోజూ జాగింగ్ వెళ్తాడు, కానీ అనఘు అశ్రద్ధ మనిషి. అదొకటి చూడాలి.

అమ్మూ ఇక్కడ వున్నప్పుడు కనీసం మాట్లాడుకోవడానికి మనిషి తోడున్నట్టుండేది.వాళ్ళు కోవిడ్ తగిలే ముందే బెంగుళూరు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోయారు. ఈ హడావిడిలో అసలు పట్టించుకోనేలేదు. నాన్న ఎలా వున్నారో, పాపం. ఒక్కడే ఆ ఫ్లాటులో.

అదృష్టవశాత్తూ, తండ్రి తమ ఇల్లు అమ్మేసి తమ ఇంటికి దగ్గర్లోనే ఒక చిన్న ఫ్లాటు కొనుక్కొని కాలక్షేపం చేస్తున్నారు. ఆయనకీ డెభ్భై అయిదేళ్ళు పైబడ్డాయి. కొవిడ్ వున్న రెండేళ్ళూ ఆయనకి ఏమైనా అవుతుందేమోనని అర చేతుల్లో ప్రాణాలు పెట్టుకోని వుంది. అత్తగారి కార్యక్రమాలకి కూడా ఆయనని రానవసరం లేదని చెప్పింది. ఒకసారి వెళ్ళి చూసి రావాలి వీలైతే. ఖమ్మంలో తమ బంధువులు చాలా మంది పోయారని చెప్పారు నాన్న. ఎవరిని చూసి, "బై బై" చెప్పినా భయంగా వుంది, ఇదే ఆఖరి వీడుకోలు కాబోతుందా అని!

ఆలోచనలు తెగేట్టు లేవు, విసుగ్గా అనుకోని లాప్‌టాప్ మూసేసింది భాను. టైము చూసింది. పదకొండున్నర. అశోక్ ఇంకా స్టడీలోనే వున్నట్టున్నాడు. లేచి స్టడీలోకి వెళ్ళి చూసింది. అశోక్ బల్లమీద తల పెట్టుకొని నిద్ర పోతున్నాడు.

"అశోక్! లే! పద, గదిలోకి వెళ్ళి పడుకుందువుగాని. చాలా రాత్రయింది," అతన్ని మెల్లిగా లేపింది. కళ్ళు తెరిచి ఒక్క క్షణం అయోమయంగా ఆమె వైపు చూసి, కుర్చీలోంచి లేచి తమ బెడ్ రూములోకి వెళ్ళి మంచం పైన పడుకున్నాడు అశోక్.

గదిలో లైటు తీసేసి చిన్న బెడ్ లైటు వేసింది భాను. పల్చటి వెల్తుర్లో అశోక్ వైపు పరీక్షగా చూసింది. రెండు నెలల్లో బాగా చిక్కిపోయాడు. నిద్దట్లో కూడా మొహం బాధగా వుంది. యేళ్ళు పై బడ్డట్టు వుంది మొహం. ఎప్పుడైంది ఇదంతా?

తామిద్దరూ నవ్వుకుంటూ, కాఫీ తాగుతూ భవిష్యత్తు గురించి ప్లానులు వేస్తూ గడిపేసిన సాయంత్రాలన్నీ యెటు పోయాయి? డబ్బు లెక్కలూ, లీవు రోజులూ, పిల్లల పరీక్షలూ, పెద్దల అనారోగ్యాలూ, ఆక్సిజన్ మాస్కులూ, ఇన్స్యూరెన్సు పేపర్లూ, ఇవన్నీ ఎప్పుడొచ్చి పడ్డాయి తమ మీదకి?

పెద్దవాళ్ళు దురమైపోతున్నారు. పిల్లలు చేతికంది రావటంలేదు. స్నేహితులనీ, బంధువులనీ జబ్బు భయం దూరం చేస్తుంది. ఎలా ఈ సమస్యలన్నీ ఒంటరిగా దాటడం? రాత్రంతా ఈ ప్రశ్నకి జవాబు ఆలోచిస్తూనే వుండిపోయిందామె.

★★★★★★★★★★★★★★★★★

"హలో నాన్నా!"

"ఆ, చెప్పు భానూ. అంతా బాగున్నారా?"

"బానే వున్నాం నాన్నా. వూరికెనే ఫోన్ చేసా. నీతో మాట్లాడి చాలా రోజులైపోయింది, ఎలా వున్నావు?"

"ఆల్ గుడ్ భానూ. అశోక్, పిల్లలూ బాగున్నారా?"

"అశోక్ ఇంకా చాలా డల్‌గా వున్నాడు. భార్గవ్ ఏదో షార్ట్ ఫిలిం షూటింగ్ అంటూ తిరుగుతున్నాడు. అనఘ పరీక్షలు దగ్గరకొస్తున్నాయని కంగారు పడుతోంది."

"నీ ఆఫీసు పని?"

"ఎప్పట్లాగే వుంది నాన్నా. ఇన్ని పన్ల మధ్య అసలు ఊపిరి తీసుకుంటున్నానా అని అనుమానంగా వుంది నాకు!"

నిట్టూర్చాడు పద్మనాభం.

"ఐ కెన్ అండర్‌స్టాండ్ భాను. పోనీ, మనింటికొచ్చి కొద్ది రోజులు కాస్త రెస్టు తీసుకుంటావా?"

" ఇంట్లో ఎవ్వరినీ ఒంటరిగా ఒదిలే పరిస్థితి లేదు నాన్నా! నువ్వొచ్చి మా ఇంట్లో వుంటావా కొద్దిరోజులు?"

"నేనొస్తే నా పని కూడా నీ నెత్తినే పడుతుంది భానూ!"

"ప్రత్యేకంగా నీ పనేం వుంటుంది నాన్నా? ఇంట్లో మాతో మాట్లాడడానికి ఒక మనిషి వుంటే బాగుండనిపిస్తుంది ఈ మధ్య నాకు. కనీసం ఒక నెల రోజులు వుండు. ఆ తరవాత కావాలంటే మళ్ళీ నీ ఫ్లాటుకి వెళ్ళిపోదువుగాని, ప్లీజ్ నాన్నా!"

"అలాగే వొస్తాలే కానీ, ఒక్క మాట అశోక్‌ని కూడా అడిగి చూడు."

"అలాగే నాన్నా. శనివారం వొస్తా, రెడీగా వుండు." ఫోన్ పెట్టేసింది భాను.

★★★★★★★★★★★★★★★★★

"అశోక్! నాన్నని కొద్ది రోజులు మన ఇంటికొచ్చి వుండమన్నాను." రాత్రి డైనింగ్ టేబుల్ దగ్గర అందరూ మౌనంగా భోజనం చేస్తూ వుండగా చెప్పింది భాను.

"గుడ్ ఐడియా. ఆయనొక్కరే ఆ ఫ్లాటులో ఎందుకు? మనతోటే వొచ్చి వుంటే మనకీ తోడుగా వుంటారు."

"నాకు కెమిస్ట్రీలో తాతయ్య హెల్ప్ చేస్తారా? చేస్తే బాగుండు!" అనఘ అన్నం కెలుకుతూ అంది.

"నీకెలా చేయలనిపిస్తే అలా చేయమ్మా! తాతయ్య మెడికేషన్సవీ జాగ్రత్త మరి! అక్కడ తాతయ్యని రోజూ చూసుకునే హెల్పరు ఇక్కడికీ వస్తుందేమో కనుక్కో. పనిలో నీక్కొంచెం సహాయంగా వుండొచ్చు." భార్గవ్ సలహా ఇచ్చాడు. పెరుగు వేసుకోబోతున్న వాడల్లా,ఆగిపోయాడు అశోక్.

"నిజమే భానూ. మీ నాన్నని ఇక్కడికి తీసుకొస్తే నీకు పని భారం పెరుగుతుంది. వొండి పెట్టాడమూ, ఆయనని డాక్టరు దగ్గరికి తీసికెళ్ళడమూ, ఇలాటి చాలా పనులు వుంటాయి." చురుగ్గా చూసింది భాను. నాలుగేళ్ళ క్రితం అత్తగారి పని గురించి ఇలాగే సణుక్కుంది తను. ఆ విషయమే దెప్పి పొడుస్తున్నాడా అశోక్?

"అవును అశోక్. నిజమే,ఇంట్లో ఒక్క మనిషి పెరిగినా పనెక్కువే అవుతుంది. కానీ ఆయనా పెద్దవుతున్నారు. నాకూ ఇంకో తోబుట్టువుంటే, ఆయనని చూసుకోవడానికి పంపించి వుండేదాన్ని. ఆయనకు చూసుకోవడానికి మనం తప్ప ఇంకెవరూ లేరు. అయినా, ఆయన ఒకటి రెండు నెలలకంటే ఎక్కువ వుండరు మనింట్లో." అశోక్ మాట్లాడకుండా లేచి వెళ్ళి చేతులు కడుక్కొని వెళ్ళిపోయాడు.

★★★★★★★★★★★★★★★

2022- జులై

అర్ధరాత్రి వరండాలో కూర్చొని వున్నాడు పద్మనాభం. ఎండాకాలం మాట వరసకి వెళ్ళిపోయినా, బయట వేడిగానే వుంది. చాలా సార్లు ఆయన అక్కడ వూరికే కూర్చొని బయట నుంచి వచ్చే శబ్దాలు వింటూ కూర్చుంటాడు. అంత రాత్రి పెద్ద శబ్దాలూ వుండవు. ఫ్రిడ్జి పని చేస్తున్న చప్పుడు, బయట అప్పుడప్పుడూ వినబడే కుక్కల మొరుగుడూ, అడపా దడపా వెళ్ళే కార్లా శబ్దమూ, ఇంతే. వీటిని ఎంతో శ్రద్ధగా వింటాడాయన.

తలుపు చప్పుడైంది. భార్గవ్ తలుపు తెరుచుకోని వొచ్చాడు.

"తాతయ్యా, ఇంకా నిద్ర పోలేదా?"

"నిద్ర రావటం లేదురా! అందుకే వూరికే బయటికొచ్చి కూర్చున్నాను. మీ అమ్మ ఎంత శ్రద్ధగా పెంచుతుందో ఆ మొక్కలు. వాటివైపు చూస్తూ వుంటే, తనని చిన్నప్పుడు చూస్తున్నట్టే వుంటుంది. వాటి వైపు చూస్తూ కూర్చుంటే మనసు ప్రశాంతంగా అవుతుంది." భార్గవ్ మౌనంగా కూర్చున్నాడు.

"ఏంటి నాన్నా? డల్‌గా వున్నావు? నీ బర్త్‌డే పార్టీ ఎక్కడ చేద్దాం? ఏమైనా ఆలోచించావా?"

"ఏం పార్టీలే తాతయ్యా! నాకసలు పార్టీ ఇచ్చే మూడ్ లేదు. అయినా ఇరవై మూడేళ్ళకి బర్త్‌డే పార్టీ ఎంటి తాతయ్యా, చిన్న పిల్లాడిలా?"

" ఎంత వయసొచ్చినా బర్త్‌డే అంటే పార్టీ వుండాల్సిందే మరి!"

భార్గవ్ ఏమీ మాట్లాడకుండా చీకటి వెల్తుర్లు చేస్తున్న నీడల వైపు చూస్తూ కూర్చున్నాడు.

"చెప్పు యంగ్ మాన్! వాట్ ఈజ్ బాదరింగ్ యూ? సినిమాలేనా?"

"అవును తాతయ్యా! నాకొక సినిమా తీయాలని వుంది. కానీ, అమ్మా నాన్నా అసలు నా మాట వినిపించుకోనే వినిపించుకోరు. వాళ్ళిద్దరూ వాళ్ళ ప్రపంచంలోవున్నారు తాతయ్యా! దే అర్ సో అన్–అవైలబుల్ టు మీ!" చిన్న పిల్లాడిలా అంటున్న ఆ ఆరడుగుల యువకుణ్ణి చూసి నవ్వాడు పద్మనాభం.

"వాళ్ళకి నీ సినిమా ఆసక్తి అర్థం కావడంలేదా?"

"వాళ్ళకి అసలు నేనే అర్థం కావడంలేదేమో!"

పద్మ నాభం లేచి వొచ్చి భార్గవ్ పక్కన కూర్చున్నాడు.

"అవునాన్నా! కొంచెం ఓపికపట్టు!"

"తెలుసు తాతయ్యా! దే అర్ గోయింగ్ త్రూ ఎ టఫ్ టైం. నాన్నకి నానమ్మ డెత్, చాలా పెద్ద దెబ్బ. అమ్మ–పాపం అన్నీ ఒక్కతే చూసుకుంటుంది. అందుకని నేను వాళ్ళనించి ఎక్కువగా ఏదీ ఎక్స్పెక్ట్ చేయను. కానీ, నా అవసరానికి అడగడానికి వాళ్ళు తప్ప నాకింకెవరున్నారు?" వాడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అసలు ఇంట్లో ఎవరికీ నేననే వాడిని ఉన్నానన్న స్పృహే వుండదు తాతయ్యా! నానమ్మా, అమ్మమ్మా, ఇద్దరే పాపం నా మాటలు వినేవారు.ఐ మిస్ దెం బోత్!"

అతని చేయి తన చేతిలోకి తీసుకున్నాడు పద్మనాభం.

"అమ్మమ్మ అయితే నేను చెప్పే సినిమా కబుర్లన్నీ ఓపిగ్గా వినేది. నానమ్మ నేను తయారు చేసిన షార్ట్ ఫిలింస్ ఓపిగ్గా చూసింది, ఎంత ఖర్చు చేసావూ, అని అడగకుండా! ఇంట్లో అందరూ ఎప్పుడూ నిశ్శబ్దం. నాన్న తన స్టడీలో పుస్తకాల వైపు చూస్తూ కుర్చుంటాడు. అమ్మ ఆఫీసు మీటింగులూ, డబ్బు లెక్కలూ, వంట పనీ, అనఘు చదువూ, ఇవే ఆమె ప్రపంచం. అనఘు, దానికి తన ఆన్‌లైన్ క్లాసులూ, కెమిస్ట్రీ ట్యూషనూ, ఇదే ధ్యాస. నేనెవరికి కావాలి?"

పద్మనాభం నిట్టూర్చాడు.

"మీ అమ్మమ్మ పోయినప్పుడు నాకు బాగా కోపమొచ్చింది."

"నీకు కోపమొచ్చిందా? నీకెప్పుడూ కోపం రాదని చెప్పింది అమ్మ!"

"అవును, ఎవరిమీదో తెలియని కోపం వొచ్చేది. అంతవరకు, నాకు ప్రతి అడుగు వేయడానికి అమ్మమ్మ తోడుండేది. ఒక్కసారి ఆమె వెళ్ళిపోయేసరికి చాలా తడబడ్డాను. మీ అమ్మ, పాపం, నాకు సహాయం చేయాలని చాలా ప్రయత్నించేది, కానీ ఒకరోజు నేనే నిర్ణయించుకున్నాను. నా రోజు వారీ వ్యవహారాలకి ఇంకెవరినీ ఇబ్బంది పెట్టకూడదని. ఒక మనిషి నిష్క్రమణం వల్ల మన మనసులో కలిగే సంఘర్షణా, సంచలనమూ అర్థం చేసుకోవడానికి చాలా టైం పడుతుంది నాన్నా. ప్రస్తుతం మీ నాన్న ఆ అయోమయమైన అవస్థలో వున్నాడు. పైగా తన మనసులో మాట పైకి చెప్పే అలవాటు లేని వాడు. ఎలా చెప్పాలో కూడా తెలిసివుండదతనికి."

నవ్వాడు భార్గవ్.

"అది నిజమే తాతయ్యా!"

"మీ నాన్న తరం వరకూ, మాకందరికీ మా బాధ్యతలు నెరవేర్చుకోవడమూ, ఇంట్లో వాళ్ళని చూసుకోవడమూ, ఇలాటివే నేర్చుకున్నాం కానీ, మనసులో బాధనీ, దుఃఖాన్నీ వెల్లడి చేయడం నేర్చుకోలేదు!"

"మరి అమ్మ?"

"అమ్మా? పాపం, ఒక్కత్తీ మనందరినీ మానసికంగా మోస్తుంది. మనందరి బాగోగులు చూసుకోవాలని తాపత్రయ పడిపోతూ, తన బాగోగులు చూసుకోవడం మరిచిపోతుంది. ఇంటి బాధ్యతలూ, వృత్తి విషయాలూ సంబాళించుకుంటోంది ఎలాగో కిందా మీదా పడుతూ! అమ్మా, నాన్నా– ఇద్దరూ మానసికంగా అలిసిపోతున్నారు నాన్నా!"

"అవును తాతయ్యా! మరిప్పుడేం చేయాలి?"

"ఏమీ లేదు నాన్నా. వాళ్ళు సర్దుకునే వరకూ ఓపిగ్గా ఎదురు చూడడం, వీలైతే వాళ్ళకి కొంచెం సాయం చేయడం. నీలాగే వాళ్ళకీ ఒక్కసారే జీవితం చాలా మలుపులు తీసుకుంటుంది. పెద్దవాళ్ళు మనని వొదిలి పెట్టి పోయినప్పుడు చాలా భయాలు మనసులో ప్రవేశిస్తాయి. మనకేదైనా జరిగితే పిల్లల పరిస్థితి ఏమిటి, తమకింకెన్నేళ్ళు మిగిలున్నాయి లాటి ప్రశ్నలు చాలా కలవరపెడతాయి. పిల్లలకి భయం వేసినప్పుడు అమ్మా–నాన్నల వైపు చూస్తారు. అమ్మా–నాన్నలకి భయం వేసినప్పుడు ఎవరి వైపు చూస్తారు? అర్థం చేసుకో!"

భార్గవ్ తాతయ్య మాటల గురించి ఆలోచిస్తూ మౌనంగా వుండిపోయాడు.

"నువ్వూ మీ నాన్న ఇద్దరూ ఒకలాగే అనిపిస్తారు నాకు. మీ నాన్న మీ అమ్మతో కలిసి మా ఇంటికొచ్చినప్పుడు దాదాపు నీ వయసే అయి వుంటాడు. నీలాగే భావుకుడు. కలల ప్రపంచంలో విహరిస్తూ వుంటాడు. ఆయన భాష పుస్తకాలైతే, నీ భాష సినిమాలు, అంతే."

"నిజమా? చెప్పు, చెప్పు తాతయ్యా! నాన్న ఆ వయసులో ఎలా వుండేవాడు?"

"నీ అంత పొడుగు కాకపోయినా, నీలాగే, సన్నగా, చురుగ్గా వుండేవాడు. కొంచెం మొహమాటస్తుడు. నాకతే మొదటి చూపులోనే భలే నచ్చేసాడు."

"పెళ్ళికి మరి మీరొప్పుకోలేదట కదా?"

"అవును, అయితే అది మీ నాన్న నచ్చకపోవడం వల్ల కాదు. ఇద్దరి కులాలూ ఒకటి కాకపోవడం వల్ల సమస్యలేమైనా వస్తాయేమో నని భయపడ్డాం."

"మరి వాళ్ళకి సమస్యలొచ్చాయా?"

"ఏమో మరి, మాతోనైతే ఎప్పుడూ చెప్పలేదు. వాళ్ళే సర్దుకున్నారు. సరే పద, వెళ్ళి పడుకుందాం. చాలా రాత్రయింది."

"తాతయ్యా! నాకొక ఐడియా వొచ్చింది! రేపణ్ణించి మనిద్దరం వంట పనీ, ఇంటి పనీ చేసి పెట్టి అమ్మని సర్‌ప్రైజ్ చేద్దామా?"

"ష్యూర్! వై నాట్? తప్పకుండా!" ఇద్దరూ లేచారు. భార్గవ్ తాతయ్య చేయి పట్టుకొని లోపలికి తీసికెళ్ళాడు.

★★★★★★★★★★★★★★★★★★★★

2022-అక్టోబరు

"అమ్మా, వచ్చే ఆదివారం మన ఇంటికి ఒక గెస్టుని తీసుకొస్తున్నాను లంచ్‌కి" అనఘ వంటింట్లో పని చేసుకుంటున్న తల్లి దగ్గరకొచ్చి అన్నది.

"యెవరా గెస్టు?" గిన్నెల పైన మూతలు పెడుతూంది భాను.

"అజ్‌హర్ అని నా స్నేహితుడు."

"అజ్‌హర్ అంటే?"

"అవును, ముస్లిం అబ్బాయి."

"ముస్లిం అబ్బాయా?"

★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS